# సూదిమందు

- శంకరమంచి పార్ధసారధి

ఉదయం పది గంటలసమయం. భాస్కరం ఆఫీసుకి వెళ్ళటానికి గదిలోంచి వచ్చాడు. హాలులో టీవీ ప్రోగ్రాం చూస్తున్న భార్య సంధ్యారాణీని అడిగాడు. ‘ అమ్మ టిఫిన్ తిన్నదా ’ అని టీవిపై నించి చూపులు తిప్పకుండానే ’ లేదు. ఆకలిగా లేదన్నారు. రాత్రి గూడా బ్రతిమాలగా గ్లాసుడు మజ్జిగ మాత్రం తీసుకున్నారు. నేను మాత్రం ఏం చెయ్యగలను చెప్పండి. ఎంతయినా కోడలు కూతురు కాదు గదా. అదేపనిగా వెంటపడి అడిగినా తప్పు. అడక్కపోయినా తప్పే. ఆవిడకి ఏం చెప్పి ఓదారుస్తారో ఓదార్చి టిఫిన్ తినిపించి వెళ్ళండి ’ అంది కాస్త నిష్టూరంగా.

భాస్కరం మరేం మాట్లాడలేక తల్లి పడుకున్న గది లోకి వెళ్ళాడు. వరలక్ష్మమ్మ గారు పడుకుని లేదు. మంచంం ఎదురుగా గోడకున్న భర్త ఫోటోవంక తదేకంగా చూస్తూ కూర్చునుంది. రెండుకళ్ళు అగ్ని గోళ్ళాల్లా జ్వలిస్తున్నాయి. కళ్ళల్లోంచి కారుతున్న కన్నీరు ముడతలు పడ్డ చెక్కిళ్ళ మధ్య నించి జారి చీర మడతల్లోకి మాయం అవుతున్నాయి రేగి పోయిన జుట్టు ఫ్యాన్ గాలికి ఎగిరెగిరి పడుతున్నాయి. ధైన్యాన్ని విచారాన్ని, విషాదాన్ని నింపుకున్న గుండ్రటి మొహం.అన్నిటికి మించి, పోతూ పోతూ భర్త తీసుకెళ్ళిన పావకాలాకాసంత బొట్టు తన గొప్పతనాన్ని పరోక్షంగా చాటిచెపుతున్నటులగా వుంది. పైశాచికదాడికి గురయ్యి, పవిత్రతను,ప్రాముఖ్యతని కోల్పోయిన దేవాలయంలా వుంది అమ్మ !

తల్లి వంక తధేకంగా చూసిన భాస్కరం కళ్ళల్లో నీళ్ళు తిరిగినాయి. నాన్నపోయి ఆరునెలలే అయినా ఈ స్వల్పవ్యవధిలోనే అమ్మలో ఎంత మార్పొచ్చింది. మనిషికి మనిషికి మధ్యన వుండీ అనుబంధాలు, ఒకరి మరణంతో తెగిపోయి జ్ఞాపకాలుగా మారి బాధిస్తాయి కాబోలు. కాక పోతే అమ్మ ఎలా వుండేది. ఎంత అందంగా వుండేది. దేవతలు ఎలా వుంటారో తెలీదు గాని, అమ్మని చూస్తే పవిత్రతకి అర్ధం తెల్సుకున్నట్లుండేది. నాన్న ప్రతి పండగకి చీర తెచ్చి ఇవ్వాల్సిందే. అమ్మ నాన్న కల్సి వెడుతుంటే నాస్తికులకి గూడా ముచ్చటగా చూడాలనిపించేలా వుండేవారు. అలాంటి అమ్మ నాన్నపోయాక, ఫెళ ఫెళా విరిగిపోయి కుప్పకూలిన పూలచెట్టులాగా, విద్యుత్ సరఫరా ఆగిపోయి , మూతబడిని జీవిత కర్మాగారం లాగా ఇంతటి మార్పా !

‘ అమ్మా ’ అన్న కొడుకు  పిలుపు విని వరలక్ష్మమ్మ  గారు కంగారుగా పమిటతో కళ్ళు తుడుచుకుని ‘ ఏం నాన్నా ఆఫీసుకి  వెడుతున్నావా ? ’ అనడిగింది.

‘ అవునమ్మా . రాత్రి ఏం తినలేదట. ఇప్పుడు గూడా  ఆకలిగా లేదన్నావుట. ఇలా అయితే నీ ఆరోగ్యం ఏం  కానమ్మా. నాన్నగార్ని తల్చుకుంటూ  కుళ్ళి పోతుంటే  నిన్ను చూస్తున్న మాకెంత భాదగా వుంటుంది.  అయినా  నాన్నగారు  ఎక్కడికి వెళ్ళారని, కళ్ళముందు  లేరుగాని, మన  మనస్సుల్లో , ఆలోచనల్లో  నిరంతరం  మనవెంటే వుంటారమ్మ, తల్లిభుజం  పైన చెయ్యి వేసి  ప్రేమగా అన్నాడు.

కొడుకు అనునయంతో  ఆవిడ దు:ఖం రెట్టింపయింది.  ‘ నిజమేరా, కానీ  కొన్ని సుఖాలు, దు:ఖాలు పంచుకునేవి కావు నాయనా ఎవరికి వారే అనుభవించాల్సినవి.  మనిషికి జ్ఞాపకశక్తి  అనేది లేకుండా  ఏ రోజు  జరిగినవి ఆ రోజుతోనే  ముగింపయితే  ఎంత బావుండేది.  మాది యాభై  సంవత్సరాల  సహజీవనం. ‘ సుళ్ళు తిరుగుతున్న జ్ఞాపకాలని విప్పి కొడుకు ముందు పరచాలని  అనుకున్నా, మళ్ళీ  తల్లిగా  సహజమైన  కరుణ, ప్రేమ తన్నుకురాగా  తన భావోద్వేగాలని అదుపు చేసుకుంటూ  ‘ పోన్లే నాయనా  నాదేం వుంది. నా గురించేం బాధపడకు. మీ నాన్న  బంగారం లాంటి నిన్నిచ్చాడు. నాకేం తక్కువ ? పడగనీడలా నావెంటే  వుంటూ, నాకేం కావాలో  అడగకముందే  అమిర్చ  పెట్టేవారు . యాభై  సంవత్సరాల  కాపురంలో  ఇది కావాలండీ  అని అడిగే  అవకాశమే  నా కివ్వకుండా  మనల్నందర్నీ  కళ్ళల్లో పెట్టుకుని  చూసుకున్నార్రా. కట్టుకున్నవాడు దుర్మార్గుడో, తిరుగుబోతో , తాగుబోతు అయితే  కొన్ని దినాల  ఏడుపుతో  మరిచిపోవచ్చు. కాని  మీ నాన్న  మచ్చలేని నిండు చంద్రుడు. అందుకే  ఈ  బాధ ! కొడుకు వొడిలో వొదిగిపోయి వెక్కి వెక్కి ఏడుస్తోంది వరలక్ష్మమ్మగరు. తల్లిని ఆ పరిస్థితిలో  చూసాక దు:ఖాన్ని  ఆపుకోలేక  తనూ వెక్కి వెక్కి  ఏడుస్తుండగా  గదిలోకి వచ్చిన కోడలు తల్లీ కొడుకుల్ని ఆ పరిస్థితిలో  చూసి, ఓదార్చాల్సిందిపోయి  మీరు గూడా  ఇదేమిటి చంటికుర్రవాడిలా. లేవండి. అత్తయ్యగారు మొన్న  డాక్టరు గారేం  చెప్పారో గుర్తుందా ? బీపీ. షుగరు  బాగా  పెరిగినాయాన్నారు. ప్రశాంతంగా  వుంటూ  వేళకి తిండి, మెడిసిన్స్ తీసుకోకపోతే, ఆరోగ్యం  మరింత క్షీణిస్తుందని చెప్పారా ? పెద్దవారు. ఇలా అయితే ఎలాగండి ’  అంది.  భాస్కరం  కాస్త గుక్క తిప్పుకుని, కర్చీఫ్‌తో  మొహం తుడుచుకని, ‘ అమ్మా  నేవస్తానమ్మా సంధ్యా ’  అమ్మకి మెడిసినిచ్చి  టిఫిన్  పెట్టు ’ అనేసి బయటకు  వెళ్ళి పోయాడు.

☆ ☆ ☆

తన సుఖం తాను చూసుకుంటూ, మిగిలిన వారు ఎలా పోతే నాకేమిటి అనుకునే మనిషికి ఎటువంటి కష్టాలు, నష్టాలు , కన్నీళ్ళు కలతలు వుండవు . భాస్కరం అలాంటి వాడు కాకపోవటం చేత ఆఫీసుకు వచ్చినా ఆలోచనలు, మనసు ఇంకా తల్లి చుట్టే తిరుగుతున్నాయి. అందువల్ల తన సన్నిహిత మిత్రుడు కామేశ్వర్రావు రావటం గాని, మూడు సార్లు తనని పిలవటం గానీ తెలీదు. కామేశ్వర్రరావు భుజం చరిచి ' ఏమిటండీ అంత దీర్ఘాలోచనలో వున్నారు ' అనే దాకా భాస్కరం ఈ లోకంలోకి రాలేకపోయాడు.

' ఏం లేదు . మా మదర్ గురించి ఆలోచిస్తున్నా. మా ఫాదర్ పోయి అర్నెల్లు కావొస్తున్నా. ఆయన ఇవాళే ఇప్పుడే పోయినట్టుగా బాధ పడుతూ, ఏడుస్తోంది. ఆవిడ ఆరోగ్యం ఏమౌతుందోనని భయంగా వుంది ' అన్నాడు.

' ఓ .....అయామ్‌సారీ , ఎల్డర్సుతో ఇదో ప్రబ్లాం . వయసు పెరిగి, వోపికి తగ్గి, వారి ప్రాముఖ్యత, అవసరం లేదని తెల్సుకుని గతకాలపు జ్ఞాపకాల్లో స్వస్థత పొందుతుంటారు. బహుశా ఫాదర్ పోవటంతో ఒంటరితనంతో బాధపడుతున్నారనుకుంటా. సాధ్యమైనంతవరకు ఆవిడని ఒంటరిగా వదలకుండా కంపెనీ ఇస్తుండండి ' తనకి తోచింది చెప్పాడు కామేశ్వర్రావు.

అంతలో భాస్కరం దగ్గర పనిచేస్తున్న నాగమణి గదిలోకి వచ్చి ఇద్దరికీ విష్ చేసి ' సారీ సర్. ఆటో స్ట్రయికు వల్ల బస్సులు దొరకటం కష్టం అయింది. అయామ్ లేట్ ' అంది నమ్రతగా.

' ఇట్సాల్‌రైట్ నో ప్రాబ్లమ్ ' అన్నాడు భాస్కరం. నాగమణి రిజిష్టర్లో సంతకం పెడుతుంటే భాస్కరం ' ఎక్స్‌క్యూజ్‌మీ ' అనటంతో ఆమె ఆగి ఏమిటన్నట్టుగా చూసింది. ' నా పర్సనల్ విషయంలో మీ సలహా కావాలి. ఆర్నెల్ల క్రితం మా ఫాదర్ పోయారు. అప్పటి నించి ఈ రోజు వరకు మా అమ్మ నిద్రాహారాలు మానేసింది. భర్తను తల్చుకుని ఏడవటంతో ఆరోగ్యం కూడా దెబ్బతిన్నది. ఆవిడన చూసినప్పుడల్లా నాకు మీరే గుర్తుకొస్తారు. మీ వారు మూడు నెలల క్రితం యాక్సిడెంటులో పోయారు. మీరు మా అమ్మలాగా కుమిలిపోకుండా ధైర్యంగా జీవితంలో ముందుకు సాగుతున్నారు. బహుశా మా అమ్మ చదువు లేని పాతకాలం మనిషి కాబట్టి అలా బాధపడుతుందేమో అనిపిస్తోంది. మీరేం అంటారు ? ' అనడిగాడు.

నాగమణి కాసేపు మౌనంగా కూర్చుంది, చేతి వ్రేళ్ళకి వేసుకున్న పాలిష్ వంక చూసుకుంటూ, బహుశా మీ నాన్నగారు అమ్మగార్ని అపురూపంగా చూసుకుని గుండెల్లో దాచుకుంటారు ' అంది. భాస్కరం వంక చూస్తూ ' అవును ప్రాణంలా, ఏ

లోటు రానీకుండా  చూసుకునే వారు. యాభై  సంవత్సరాల  సాహచర్యం. మరవటం అంత తేలిక్కాదు ' అన్నాడు పైన  తిరుగుతన్న  ఫ్యాన్  వంక చూస్తూ  ...అక్కడే   వున్న కామేశ్వరా(రావు  కలుగచేసుకుంటూ ' అందే కాదు భాస్కర్ . ప్రేమగా  చూసుకోవటం మాత్రమే కాదు . కపటాలు , మోసం , అబద్దాలు తెలీని పురుషుడిన స్త్రీ అంత తేలిగ్గా మరవలేదు.  కదూ  నాగమణి ' అన్నాడు.

నాగమణికి తెల్సు  అతను తన గురించి, గతించిన  తన భర్త గురించి మాట్లాడుతున్నాడని.

' మీరు చెప్పింది ఒక స్త్రీకే  కాదు . పురుషులకి  వర్తిస్తుంది.  తన వెనక  తనకి తెలీకుండా  తన భార్య  మరో  పురుషుడితో  సంబంధం పెట్టుకుందని  తెలిస్తే. ఆమెని భరిస్తాడేమో  గాని, ప్రేమించలేడు.  అలాటి స్త్రీ తో సంబంధం  వుందని  తెలిస్తే మీ అమ్మగారు  అంతలా బాధపడదు ' అనేసి చటుక్కున లేచి వెళ్ళిపోయింది.

భాస్కరం, కామేశ్వర్రావులు  చూపులు మార్చుకున్నారు.

☆ ☆ ☆

ఇది జరిగిన వారం రోజుల తర్వాత, ఒక రోజు ఉదయం పదకొండు గంటలవుతోంది. బాస్కరం  డిపార్టుమెంటు పరీక్షల కారణంగా సెలవు పెట్టి  పుస్తకాలు ముందేసుకుని కూర్చున్నాడు. వరలక్ష్మమ్మ  గారు గదిలో  పడుకుంది. సంధ్యారాణి టీవీలో సీరియల్ చూస్తోంది. అంతలో ఒక వ్యక్తి వచ్చి ' సార్. ప్రభాకర్రావు గారికి కొరియర్ ' అరిచాడు.  ఆ మాట విని ముగ్గురూ ఉలిక్కిపడి. హాలులోకి వచ్చారు.  భాస్కరం  ఆ వ్యక్తి చేతుల్లో  వున్న కవర్ని  అందుకుని చూసాడు.  అడ్రెసు  తన తండ్రిదే  వరలక్ష్మమ్మ  గారు ' ఏమిట్రా అది ' అనడిగింది. ' నాన్న గారి  పేర్న  ఉత్తరం  అమ్మా. వైజాగ్ నుంచి  ఎవరో సత్యవతి గారట ' అన్నాడు.  అందరి మొహాల్లో  సందేహం, అనుమానం . మనిషి  పోయిన ఆర్నెల్లకి  ఉత్తరం రావటం  ఒక కారణం కాగా,  మహిళ దగ్గర్నించి  రావటం మరో కాణం. భాస్కరం  సంతకం  చేసి  వాడిని పంపించి  కవర్ని  యధాతథంగా  తల్లికి ఇవ్వబోగా ' మనకి తెల్సి వాళ్ళెవరూ లేరే. చింపి చదవరా ' అంది.

భాస్కరం  కవరు చింపి చదవటం ప్రారంభించాడు. ప్రేమమూర్తులు ప్రభాకరరావుగారికి నమస్కారములు  అని వ్రాయాలనిపించటం లేదు.  కారణం  మీపైనా చాలా కోపంగా వుంది.  ఆరు నెలలుగా  మీ నుంచి  ఉత్తరం  గాని, కనీసం ఫోన్ గూడా

లేదు. నేను, నా బిడ్డ చచ్చిపోయాం అనుకున్నారా. ఎన్నిసార్లు ప్రయత్నించినా స్విఛ్చాఫ్ అని వస్తోంది. డబ్బులు పంపటం కూడా మానేసారు.

నేనంటే మొహం మొత్తిందా , కనీసం రవి గురించన్నా రావొచ్చు గదా. నిన్నెప్పటికి మోసం చెయ్యనని చేతిలో చెయ్యివేసి ప్రమాణం చేసారే. మరిచి పోయారా. ఈ ఉత్తరం కూడా మిమ్మల్ని కదిలించలేక పోతే మీ పుణ్యమా అని నేను నా బిడ్డ ఏ నుయ్యో గొయ్యో చూసుకోవాల్సిందే ' అంతవరకు విన్న వరలక్ష్మమ్మ గారు ఉద్వేగంతో స్పృహ తప్పిపడిపోయారు. భాస్కరం , భార్య కల్సి ఆవిడని మంచం పైకి చేర్చారు.

ఆ రోజు నించి ఇంట్లో వాతావరణం గంభీరంగా తయారైంది. ఎవరు ఎవరితోనూ మాట్లాడరు. వరలక్ష్మమ్మగారితో మాట్లాడే సాహసం చేయలేక పోతున్నారు. కాని విచిత్రంగా ఉత్తరం వచ్చిన నాటి నించి ఆవిడలో స్పష్టమైన మార్పు కనబడుతోంది. ఇది వరకు లాగా ఏడుస్తూ మంచానికే పరిమితం కావటం లేదు. లేచి తిరుగుతోంది తన పనులు తాను చేసుకుంటోంది. అడపాదడపా టీవీ కార్యక్రమాలు గూడా చూస్తోంది.

ఒక వారం తర్వాత –

ఆఫీసుకు వెడుతున్న కొడకుని పలకరించింది. ' వొరేయ్ భాస్కరం అలా కూర్చో నీతో మాట్లాడాలి ' అంది. తల్లి మాటలకి కంగారు పడ్డ మాట నిజం. ఆ వుత్తరం వచ్చాక తండ్రి పట్ల తనకి కూడా అనేక సందేహాలు కలిగిన మాట వాస్తవం. నాన్న నిప్పులాంటి వాడని, దేవుడిని తనూ నమ్మాడు. కానీ అలాటి నాన్నకి మరో స్త్రీతో సంబంధమా ! ఎంత ఆలోచించినా నమ్మకం కుదరటం లేదు.

భాస్కరం కుర్చీలో తల్లికి ఎదరుగా కూర్చుని ' చెప్పమ్మా, ఏమిటి ? ' అన్నాడు.

' నువ్వు వెంటనే వైజాగ్ వెళ్ళి రావాలి. కళ్ళు వొత్తుకుంటే అందావిడ. భాస్కరానికి ఆవిడ మాటలేం అర్థం కాలేదు. ' దేనికమ్మా ' అనడిగాడు.

' మొన్న నాన్నగారి పేరున ఉత్తనం రాసిందే, ఆ సత్యవతిని, కుర్రవాడిని మనింటికి తీసుకురావాలి. ఇక నంచి వాళ్ళూ మనతోనే వుంటారు ' అంది నిర్భయంగా. ఆ మాటలు విన్న కొడుకు కోడలు నమ్మలేనట్టుగా మొహాలు చూసుకున్నారు.

' ఏమిటమ్మా నువ్వంటున్నది. ఆవిడెవరు మనం ఎవరు. అసలయినా ఏదో కార్డు ముక్క రాసి పడేసినంత మాత్రాన అదంతా నిజం అని ఎలా అనుకుంటాం ! అంటే నాన్నగారి వ్యక్తిత్వాన్నే నువ్వు అనుమానిస్తున్నావా అడిగాడు.

' నేను ఆలోచిస్తున్నది మీ నాన్న శ్రీరామచంద్రుడా , శ్రీకృష్ణుడా అని కాదు. ఆ సత్యవతి అనే స్త్రీ గురించి .....నాకు ఏ లోటూ రాకుండా అన్ని ఏర్పాట్లు చేసినా

వియోగానికి  ఇంతగా బాధపడుతున్నానే, చట్ట  విరుద్దంగా  మీ నాన్నతో  సంబంధం పెట్టుకుని  బిడ్డని  కన్న ఆవిడెంత  బాధపడాలి ? ఏడవాలి ? ప్రేమ  వున్న  చోట తప్పులు కనబడవు . మీ నాన్నని  నేనుప్రేమించా కాబట్టి  ఆ తప్పుని కాచుకుని ఆయనకి చెడ్డపేరు రాకుండా చుడటం   నా కర్తవ్యం.

అంతా వింటున్న  కోడలు కస్సుమన్నది. ' ఏమిటండీ ఇది. మా  పరువు  మర్యాదలు , మా పిల్లలు భివిష్యత్తులు ఏం కాను ? అసలిదంతా నిజమని ఏమిటి రుజువు ? ' అంది కోపంగా. వరలక్ష్మమ్మ  గారు ఏం మాట్లాడకుండా లేచి తన  గదిలోకివెళ్ళిపోయింది.

భాస్కరం  భార్యకి ధైర్యం చెబుతున్న ధోరణిలో ' అవేశపడకు. ఆవిడ ఉత్తరం రాసిందే గాని తన అడ్రసు గాని, కనీసం ఫోను నెంబరు కూడా ఇచ్చింది కాదు.  నువ్వేం కంగారు  పడకు '  అనేసి ఆఫీసుకు వెళ్ళిపోయాడు.

మనసంతా అదోలా వుందనిపించింది భాస్కరానికి. అమ్మ ఆ విషయం  ఇంతటితో మర్చిపోతే  బావుండు. లేకపోతే  ఇంట్లో శాంతి కరువవుతుంది అనుకున్నాడు.  నాగలక్ష్మి తలపు తోసుకుని  గదిలోకి  వచ్చింది.  ఆఫీసు  పని గురించి  మాట్లాడాకా, వెళ్ళిపోబోతూ ' అమ్మగారెలా   వున్నారు ' అనడిగింది.

' వున్నది  చాలదన్నట్టు కొత్త  సమస్య  వచ్చి పడింది '  అంటూ జరిగిన పరిణామాలన్నీ  పూస గుచ్చినట్లుగా  చెప్పేసాడు.

నాగలక్ష్మి నిల్చున్నది, కుర్చీలో  తిరిగి కూర్చుని తలవంచుకుని ' మీ అమ్మగారు చాలా గొప్పవారు.  ఎంతమంది స్త్రీలు మీ అమ్మగారిలా మనవతా దృక్పదంతో  ఆలోచిస్తారు. మీ నాన్నగారు అప్పుచేసుంటే ఆ అప్పు  మీరు తీర్చుండే వారు  కదా.  అలాగే  ఆయన తప్పుచేస్తే  ఆ తప్పుని  కాచుకోవాల్సిన  బాద్యత కూడా  వుంటుంది.  గతించిన  భర్తని మర్చిపోలేక  ఆవిడ  బాధపడి క్రుంగి  కృశించి  పోతున్నారని  మీరు చెప్తే విని,  ఆయన వ్యక్తిత్వంపైన కాస్త బురద చల్లితే  ఆవిడ  దు:ఖం  బాధ తగ్గుతాయన్న  ఉద్దేశంతో  ' – భాస్కరం  వులిక్కిపడీ ' అంటే ఆ ఉత్తరం మీరు ఆశ్చర్యంగా అడిగాడు. నాగలక్ష్మి అవునన్నట్టుగా తలాడించి  బయటికి వెళ్ళిపోయింది.

ఆమె వెనక భాస్కరం తెల్లబోయాడు.

------- అయ్యిపోయింది -------